# ఆ ప్రచారాన్ని నమ్మొద్దు



**అగ్ర హీరో ఎన్టీఆర్** జిమ్‌లో వర్కవుట్స్ చేస్తుండగా తీవ్రంగా గాయపడ్డారంటూ బుధవారం మీడియాలో వార్తలొచ్చాయి. ఆయన పెద్దప్రమాదం బారిన పడ్డారని సోషల్ మీడియాలో కూడా ప్రచారం జరిగింది. వీటిపై ఎన్టీఆర్ వ్యక్తిగత బృందం స్పందించింది. మీడియాలో ప్రచారం అయిన వార్తల్లో ఏమాత్రం నిజం లేదని, ఆయన సురక్షితంగా ఉన్నారని స్పష్టం చేసింది. 'రెండు రోజుల క్రితం జిమ్‌లో వర్కవుట్స్ చేస్తుండగా ఎన్టీఆర్ ఎడమచేతికి చిన్న గాయమైంది. ప్రాథమిక చికిత్స తీసుకున్న తర్వాత మంగళవారం ఆయన 'దేవర' షూటింగ్‌లో కూడా పాల్గొన్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ కోలుకుంటున్నారు. మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని అభిమానులు నమ్మొద్దని కోరుతున్నాం' అని ఎన్టీఆర్ టీమ్ పేర్కొంది. కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిస్తున్న 'దేవర' షూటింగ్ చివరి దశకు చేరుకుంది. సెప్టెంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతున్నది.



# ఎక్కడ చూసినా 'ఆయ్' సందడే..!

'ఈ కథ నా దగ్గరకు వచ్చినప్పుడు 'కొడితే పదిమంది కింద పడే కథ కాదు కదా? అనడిగాను. ఎంత గొప్ప ఫ్యామిలీ నుంచి వచ్చినా ఎవరి కష్టం వారు పడాలని ఎన్టీఆర్ ఓ సందర్భంలో అన్నారు. నార్నే నితిన్ కూడా ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాడు' అన్నారు అగ్ర నిర్మాత అల్లు అరవింద్. ఆయన సమర్పకుడిగా తెరకెక్కిన చిత్రం 'ఆయ్'. ఎన్టీఆర్ బావమరిది నార్నే నితిన్ హీరోగా నటించిన ఈ చిత్రానికి అంజి కే మణిపుత్ర దర్శకుడు. జీఏ2 పిక్చర్స్ పతాకంపై బన్నీవాసు, విద్యా కొప్పినీడు నిర్మించారు. నేడు ప్రేక్షకుల ముందుకొస్తున్నది. మంగళవారం హీరో నిఖిల్, శ్రీలీల ముఖ్య అతిథులుగా ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన హీరో నిఖిల్..సోషల్‌మీడియాతో పాటు బయట ఎక్కడ చూసినా 'ఆయ్' సందడే కనిపిస్తున్నదని, ఈ సినిమా బ్లాక్‌బస్టర్ హిట్ కావాలని ఆకాంక్షించారు. 'ఈ కథ విన్నప్పుడు 'జాతిరత్నాలు' సినిమా గుర్తుకొచ్చింది. నార్నే నితిన్ అంకితభావంతో పనిచేశాడు' అని నిర్మాత బన్నీ వాసు తెలిపారు. ఈ కథ విన్న తర్వాత అల్లు అరవింద్‌గారు ఫోన్ చేసి ఎంతగానో ఎంకరేజ్ చేశారని, ఈ ప్రపంచంలో కులాలు, మతాల కంటే స్నేహమే గొప్పదనే అంశాన్ని ఈ సినిమాలో చూపించామని హీరో నార్నే నితిన్ పేర్కొన్నారు.

## క్రీడా నేపథ్యంలో..



**సీనియర్ నటుడు శివాజీరాజా** తనయుడు విజయ్ రాజా హీరోగా నటిస్తున్న చిత్రం 'జీరో'. లక్ష్మీనారాయణ సి దర్శకుడు. ఆర్.లక్ష్మణ్‌రావు, ఆర్.శ్రీను నిర్మిస్తున్నారు. బుధవారం టైటిల్ ప్రకటనతో పాటు గ్లింప్స్‌ని ప్రముఖ రచయిత, నటుడు తనికెళ్ల భరణి విడుదల చేశారు. లవ్, ఫ్యామిలీఎమోషన్స్ ప్రధానంగా స్పోర్ట్స్ నేపథ్య కథాంశమిదని దర్శకుడు తెలిపారు. జీవితంలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక దశలో స్పోర్ట్స్ ఆడే ఉంటారని, వారందరికి స్ఫూర్తినిచ్చే ఇతివృత్తమని నిర్మాతలు పేర్కొన్నారు. స్ఫూర్తివంతమైన కథగా ఆకట్టుకుంటుందని హీరో విజయ్‌రాజా అన్నారు. రాజేంద్రప్రసాద్, ఆమని, శివాజీరాజా, సంపత్‌రాజ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సాయికార్తీక్.

# బాలీవుడ్ ఎంట్రీకి సిద్ధం



**అచ్చ తెలుగు అందం శ్రీలీల** అనతికాలంలోనే తెలుగు చిత్రసీమలో అగ్ర నాయికగా ఎదిగింది. అయితే ఈ అమ్మడు నటించిన చిత్రాలు ఆశించిన స్థాయిలో సక్సెస్ కాకపోవడంతో రేసులో కాస్త వెనకబడింది. అయినా ఈ భామకు మంచి అవకాశాలే వస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం శ్రీలీల బాలీవుడ్ అరంగేట్రానికి రంగం సిద్ధమైనట్లు తెలిసింది. సిద్ధార్థ్ మల్హోత్రా హీరోగా నటించబోతున్న 'మిట్టి'లో ఆమె కథానాయికగా ఎంపికైందని వార్తలొస్తున్నాయి. బల్వీందర్‌సింగ్ దర్శకత్వం వహించనున్న ఈ సినిమా ప్రీప్రొడక్షన్ పనుల్లో ఉంది. అక్టోబర్‌లో సెట్స్‌మీదకు వెళ్లనుంది. ఈ సినిమా కోసం శ్రీలీలతో సంప్రదింపులు పూర్తయ్యాయని, కథలోని కొత్తదనం నచ్చడంతో ఆమె అంగీకారం తెలిపిందని సమాచారం. శ్రీలీల ప్రస్తుతం తెలుగులో నితిన్‌తో 'రాబిన్‌హుడ్' చిత్రంలో నటిస్తున్నది. రవితేజ 75వ చిత్రంలో కూడా ఆమే కథానాయిక.



## ఉమ సందేశం

సుమయా రెడ్డి కథానాయికగా నటిస్తున్న చిత్రం 'డియర్ ఉమ'. ఈ సినిమాకు ఆమె కథనందించడంతో పాటు నిర్మాతగా కూడా వ్యవహరిస్తున్నది. సాయి రాజేష్ మహాదేవ్ దర్శకుడు. పృథ్వీ అంబర్ హీరోగా నటిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. త్వరలో విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీ ఇది. ఓ జంట ప్రేమ ప్రయాణానికి అందమైన దృశ్యరూపంగా మెప్పిస్తుంది. మంచి సందేశం కూడా ఉంటుంది ' అన్నారు.

## సామాన్యుడి 'పరాక్రమం'

స్వీయ దర్శకత్వంలో బండి సరోజ్‌కుమార్ హీరోగా నటిస్తున్న చిత్రం 'పరాక్రమం' ఈ నెల 22న ప్రేక్షకుల ముందుకు రానుంది. బుధవారం ట్రైలర్‌ను హీరో సందీప్‌కిషన్ ఆవిష్కరించారు. బండి సరోజ్ కుమార్ మాట్లాడుతూ 'కామన్ మ్యాన్‌కు కనెక్ట్ అయ్యే కథాంశమిది. ఈ కథ మనల్ని మనం తెరపై చూసుకున్న అనుభూతినిస్తుంది' అన్నారు. బండి సరోజ్‌కుమార్ అద్భుతమైన ప్రతిభావంతుడని, అతని వ్యక్తిత్వం కూడా గొప్పదని సందీప్‌కిషన్ ప్రశంసించారు. ఈ చిత్రానికి కెమెరా: వెంకట్ ఆర్ ప్రసాద్, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, సంగీతం, నిర్మాత, దర్శకుడు: బండి సరోజ్‌కుమార్.



# పొల్లాచ్చిలో యాక్షన్ షురూ



అగ్ర హీరో వెంకటేష్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో ఓ చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఎఫ్–2, ఎఫ్–3 చిత్రాల తర్వాత వీరిద్దరి కలయిలో రాబోతున్న ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం కేరళలోని పొల్లాచ్చిలో జరుగుతున్న షూటింగ్‌లో హీరో వెంకటేష్ జాయిన్ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ని మాజీ పోలీస్ అధికారిగా పరిచయం చేస్తూ స్పెషల్‌వీడియోను విడుదల చేశారు. నెలరోజుల పాటు జరిగే ఈ షెడ్యూల్‌లో టాకీ పార్ట్‌తో పాటు సాంగ్స్ తెరకెక్కించబోతున్నారు. హీరో, ఆయన భార్య, మాజీ ప్రేయసి మధ్య నడిచే ట్రయాంగిల్ క్రైమ్ ఎంటర్‌టైనర్ ఇదని, ఆద్యంతం వినోదప్రధానంగా ఆకట్టుకుంటుందని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి, ఐశ్వర్యరాజేష్ కథానాయికలుగా నటిస్తున్నారు.

# కెరీర్‌లోనే బెస్ట్‌రోల్ చేశాను

వాణిజ్య పంథాలోనే ప్రయోగాత్మక చిత్రాలు చేయడంలో సిద్ధహస్తుడు అగ్ర హీరో విక్రమ్. శివపుత్రుడు, అపరిచితుడు, నాన్న, ఐ వంటి చిత్రాలు నటుడిగా ఆయన ప్రతిభను చాటిచెప్పాయి. ఆయన తాజా చిత్రం 'తంగలాన్' నేడు ప్రేక్షకుల ముందుకొస్తున్నది. కోలార్ బంగారు గనుల నేపథ్యంలో పీరియాడిక్ కథాంశంతో తెరకెక్కించారు. పా.రంజిత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని స్టూడియో గ్రీన్ పతాకంపై కేఈ జ్ఞానవేల్‌రాజా నిర్మించారు. చిత్ర విడుదలను పురస్కరించుకొని హీరో విక్రమ్ పంచుకున్న విశేషాలు...



- **'తంగలాన్'** హృదయాన్ని కదిలించే భావోద్వేగాలతో పాటు రా కంటెంట్‌తో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినందిస్తుంది. సాధారణ సినిమా సూత్రాలు, గ్రామర్‌ను పక్కనపెట్టి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ సినిమాలో ఓ విస్తారమైన జీవితం కనబడుతుంది.
- 'తంగలాన్' అన్నది ఓ తెగ పేరు. ఇందులో బంగారం వేట అన్నది కథలో ప్రధానంగా కనిపించినా..వాస్తవంగా ఇది స్వేచ్ఛ, సమానత్వం కోసం ఆ తెగ చేసిన పోరాటం, త్యాగాలకు అద్దం పడుతుంది. ఆకలి, అసమానతలను మనందరం జీవితంలో ఎప్పుడో ఓసారి ఎదుర్కొనే ఉంటాం. అందుకే ప్రతి ఒక్కరికి ఈ కథ కనెక్ట్ అవుతుంది.
- దర్శకుడు పా.రంజిత్ రా కంటెంట్‌కు తనదైన కళాత్మకతను జోడించి భావోద్వేగభరితంగా చిత్రాన్ని తీర్చిదిద్దాడు. ఈ సినిమాలో అడ్వెంచర్‌తో పాటు అంతర్లీనంగా గొప్ప సందేశం ఉంటుంది. నా కెరీర్‌లో ఇప్పటివరకు చేసిన బెస్ట్‌రోల్ ఇదే అనుకుంటున్నా. భిన్న కోణాలు కలిగిన రెండు పాత్రల్లో చాలా సహజంగా కనిపించేందుకు ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకున్నా. ఆహారం లేక చిక్కిశల్యమయ్యే పరిస్థితుల్లో హీరో దృఢంగా కనిపిస్తే పాత్రలో సహజత్వం లోపిస్తుంది. అందుకే ఆ పాత్ర కోసం పూర్తిగా సన్నబడి కనిపించాను.
- షూటింగ్ టైమ్‌లో మేకప్ కోసమే గంటల కొద్ది సమయం పట్టేది. మళ్లీ మేకప్ తొలగించుకునేందుకు రెండు గంటలు అయ్యేది. తీవ్రమైన చలి, వేడిని భరిస్తూ షూటింగ్‌లో పాల్గొన్నా. మనకు ఇష్టమైన పని దొరికినప్పుడు ఆకలి, నిద్ర మరచిపోతాం. మిగతా విషయాలేవీ పట్టించుకోం. ఈ కథలోని ఇంటెన్సిటీ నచ్చడంతో షూటింగ్ పరమైన ప్రతికూలతల గురించి ఏమాత్రం ఆలోచించకుండా పాత్రలో లీనమై నటించా.
- ఇది కేవలం పాన్ ఇండియా సినిమా కాదు. పాన్ వరల్డ్‌కు రీచ్ అయ్యే కథ. ఆ స్థాయిలో దర్శకుడు పా.రంజిత్ ఈ చిత్రాన్ని మలిచాడు. నిర్మాత జ్ఞానవేల్‌రాజా నిర్మాణపరంగా ఎక్కడా కాంప్రమైజ్ కాలేదు. సినిమాలోని ప్రతి సన్నివేశం అద్భుతంగా ఉంటుంది. ప్రేక్షకులను ఓ సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుంది.











